క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కాకాణిని సత్కరిస్తున్న పార్టీ నాయకులు

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్కు మస్తాన్, గుండుబోయిన వెంకటరమణయ్యలు శుక్రవారం మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పలు అంశాలను కాకాణి దృష్టికి తీసుకొచ్చారు.

ఘనంగా వేళాంగణి ఉత్సవాలు



సీతారామపురం: స్థానిక అరుంధతీయవాడలో వేళాంగణి మాత నవదిన ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని వేళాంగణి మాత మండపానికి శుక్రవారం ప్రత్యేకాలంకరణ చేశారు. అనంతరం మాత స్వరూపాన్ని ఊరేగించారు. విచారణ గురువు గుడిపాటి థామస్ ప్రార్థనలు నిర్వహించారు.

వైభవంగా అలఘునాథుని కల్యాణం



ఆత్మకూరు: పట్టణంలో పురాతన ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్ది ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు శ్రీనివాస్, రామయ్య స్వామి కల్యాణ ఘట్టాలను శాస్త్రోక్తంగా వివరిస్తూ వేదమంత్రాలతో వేడుకను చేశారు. అన్నప్రసాద వితరణ గావించారు. కంచి పరమేశ్వరరెడ్డి, జయలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఆలయ కమిటీ వారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీ



సంగం: సంగంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో యూరియా నిల్వలు, రికార్డులను అగ్రికల్చర్ విజిలెన్స్ అధికారి టి.వేణుగోపాల్‌రావు, డిప్యూటీ కమర్షియల్ టాక్స్ అధికారి కె.విష్ణురావు పరిశీలించారు. యూరియాను బ్లాక్ మార్కెటింగ్‌కు తరలించినా, రైతులను ఇబ్బందులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గిరిజన సమస్యల పరిష్కార వేదిక నేడు

ఆత్మకూరురూరల్: మండలంలోని గిరిజనుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా శనివారం ప్రత్యేక ఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఇన్‌చార్జి తహసీల్దార్ శాంతి స్వరూప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, గిరిజన కుటుంబాల వారు తమ సమస్యల పరిష్కారం కోసం తగిన ఆధారాలతో విన్నవించుకొని పరిష్కారం పొందవచ్చని తెలియజేశారు.

- సీతారామపురం: గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు శనివారం ఉదయం 10 గంటలకు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ డే కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ ఫజిహా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వచ్ఛంద నేత్రదానం సంప్రదాయంగా మారాలి

నెల్లూరు(అర్బన్) : స్వచ్ఛంద నేత్రదానాన్ని కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ శార్వాణి అన్నారు. ఆ సంస్థ, పీహెచ్‌పీ (పీఎంపీ) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులోని వేదాయపాళెంలోని నెల్లూరు స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం శార్వాణి మాట్లాడుతూ ఎవరైనా మరణించిన ఆరు గంటల్లోపు నేత్రాలను దానం చేస్తే మరో ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించవచ్చన్నారు. శ్రీలంకలో నేత్రదానం చేసేవారి సంఖ్య చాలా ఎక్కువగా ఉందన్నారు. అయితే సంప్రదాయాల పేరిట మనదేశంలో అతితక్కువ మంది మాత్రమే నేత్రదానం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, సభ్యులు రామరఘురామయ్య, శంకరరావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై గుంత.. ప్రజలకు చింత



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

ఉదయగిరి పట్టణంలోని సోంపల్లి వీధి, కరీమా వీధులకు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపై గుంత ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతూ పలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారి మధ్యలో వెళ్లే సైడ్ కాలువపై ఉన్న సిమెంట్ రాళ్లు ధ్వంసం కావడంతో గుంత ఏర్పడింది. ఆ మార్గంలో వెళ్లే వారు గుంతను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతపై సిమెంట్ మూతను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. – ఉదయగిరి రూరల్

అంతా మా ఇష్టం



దుత్తలూరు సెంటర్‌లో నిలిపిన ప్రైవేటు బస్సులు

మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలు నడిరోడ్డుపై ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నారు. దీనివల్ల వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగానే గంటల కొద్దీ వాహనాలు నిలుపుతున్నా పట్టించుకునే వారు లేరని పలువురు వాపోతున్నారు. దీనివల్ల ఆర్టీసీ బస్సులు దుత్తలూరు సెంటర్ దాటి ముందుకు వెళ్లి నిలపడంతో విద్యార్థులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అంతేకాక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నడిరోడ్డుపై ప్రైవేటు వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – దుత్తలూరు

నిరుపయోగంగా తాగునీటి బోరు



వరికుంటపాడు మండలంలోని వేంపాడు పంచాయతీ భోగ్యంవారిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో తాగునీటి బోరు గత ఏడేళ్లుగా చేతిపంపు లేక నిరుపయోగంగా పడి ఉంది. దీనివల్ల అంగన్‌వాడీ, ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. బోరు సరిగ్గా ఉండి కూడా వినియోగంలో లేకపోవడం పట్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే చేతిపంపును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

– వరికుంటపాడు

భక్తిశ్రద్ధలతో మిలాద్–ఉన్–నబీ



అనుమసముద్రంపేట: ర్యాలీ చేస్తున్న ముస్లింలు



ఉదయగిరి: పెద్ద మసీదులో..



సీతారామపురంలో..

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండల కేంద్రంలోని హజ్రత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గా వద్ద మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక ముస్లిం యువకులు జెండాలు చేతబట్టి ఏఎస్‌పేటలోని పురవీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం కొండపై ఉన్న బురుజు మీద జెండాలు పాతి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర, గొప్పతనాన్ని మత గురువులు వివరించారు.

- ఉదయగిరి: పట్టణంలోని ముస్లింలు మిలాద్–ఉన్–నబీ వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఖాదిరియా ఆస్థాన, చిన్న పెద్ద మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కటింగ్ చేశారు. ప్రవక్త చిహ్నాలను భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. ముస్లిం మత పెద్దలు ఖురాన్ గురించి వివరించారు. ప్రతిఒక్కరూ ప్రవక్త బోధనలు అనుసరిస్తూ సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. అనంతరం భక్తులకు స్వీట్‌లు పంచిపెట్టారు. సాయంత్రం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్, దాసరపల్లి, బిజ్జంపల్లి, అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.
- కావలి (జలదంకి): మిలాద్–ఉన్–నబీ వేడుకలను కావలి పట్టణంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు పచ్చ జెండాలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రవక్త గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. ఈ వేడుకల్లో కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.
- సీతారామపురం: మండలంలోని సీతారామపురం, తురకపాళెం, అయ్యవారిపల్లి, రంగనాయుడుపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మసీదులు, దర్గాలు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు మహమ్మద్ ప్రవక్త సందేశాలను వినిపించి ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. రంగనాయుడుపల్లి, తురకపాళెం గ్రామాల్లోని దర్గాల వద్ద అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి.. రాగి చోరీ

- రూ.7 లక్షల మేర నష్టం



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

ఆత్మకూరు: ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లో పలు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి వాటిలోని రాగి వైర్లు, ఆయిల్ చోరీ చేయడంతో సుమారు రూ.7 లక్షల నష్టం విద్యుత్ శాఖకు ఏర్పడిందని ఏడీఏ చిన్నస్వామి నాయక్ తెలిపారు. ఈ చోరీలపై ఆయా గ్రామాలకు చెందిన వారు సమాచారం ఇవ్వడంతో తాను, సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి పొలాల వద్ద, మండలంలోని గొల్లపల్లి పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను, అనంతసాగరం మండలంలో ఏర్పాటు చేసిన మొత్తం నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పగులగొట్టారని, విలువైన రాగి తీగలు, ఆయిల్‌ను చోరీ చేసినట్లు గుర్తించామన్నారు. దీనివల్ల విద్యుత్ శాఖకు లక్షలాది రూపాయలు నష్టం ఏర్పడడంతో పాటు సాగు చేస్తున్న రైతులకు నీటి ఇక్కట్లు ఏర్పడుతాయని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. రైతులు అప్రమత్తంగా ఉండి, కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే విద్యుత్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మోటార్ బైక్‌ల ఢీ : ఇద్దరికి గాయాలు



గాయపడిన గురుప్రసాద్



గాయపడిన బాబురావు

కలిగిరి: నాగిరెడ్డిపాళెం సెంటర్ సమీపంలో మోటార్‌బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వీర్నకొల్లు గ్రామానికి చెందిన డేగా బాబురావు బైక్‌పై బసిరెడ్డిపాళెం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. కొండాపురం మండలం బసిరెడ్డిపల్లికి చెందిన గురుప్రసాద్ బైక్‌పై కలిగిరి నుంచి వింజమూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నాగిరెడ్డిపాళెం సెంటర్ సమీపంలో గురుప్రసాద్ బైక్‌పై వేగంగా వస్తూ ముందు వెళ్తున్న బాబురావు బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో వారిని వింజమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కలిగిరి ఎస్సై ఉమాశంకర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టదా..?

- 9న అన్నదాతలతో కలిసి ధర్నా
- వైఎస్సార్‌సీపీ నాయకుల వెల్లడి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని, రైతులు పడుతున్న యూరియా కష్టాలు ప్రభుత్వానికి కనబడడం లేదా అని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. ఆత్మకూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, రమేష్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. గతంలో జగనన్న పాలనలో ఆర్బీకేల ద్వారా స్థానికంగా కావల్సినంత యూరియా రైతులకు అందిందని, ప్రస్తుత ప్రభుత్వం యూరియా కోసం రైతులను రోడ్లపైకి తీసుకొచ్చిందన్నారు. ఓ వైపు టీడీపీ తోక పత్రికలే యూరియా దారి మళ్లిందని, ముందుగానే తరలించేశారని పతాక శీర్షికలతో ప్రచురించినా ఆ పార్టీ కళ్లు తెరవడం లేదన్నారు. యూరియా ప్రైవేట్‌కు తరలించడంతో బస్తాకు రూ.120 చొప్పున అధికంగా వసూలు చేస్తూ రైతులను పీల్చి పిప్పి చేస్తున్నారని మండిపడ్డారు. మరో వైపు వ్యవసాయ శాఖ మంత్రి రైతులను కించపరిచేలా బఫే భోజనాల కోసం క్యూలో నిలబడడం లేదా అంటూ రైతులపై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇదిలా ఉంటే ధాన్యం ధర సగానికి పడిపోయి వరి కోతలు ముమ్మరం అవుతున్న క్రమంలో రైతులకు మరో ఆందోళన కలిగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. గతంలో ఎడగారు ధాన్యం రూ.20 వేలు నుంచి రూ.25 వేలకు విక్రయించగా ప్రస్తుతం రూ.15 వేలకే పలుచోట్ల ధాన్యం కొనుగోలు చేస్తున్నారని.. ఇది రైతులకు కడుపు మండేలా చేస్తోందన్నారు. దీనిపై రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు 9వ తేదీ మంగళవారం ఆత్మకూరు డివిజన్ స్థాయిలో పది మండలాల రైతులతో పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, ఆర్డీఓకు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలాల పార్టీ కన్వీనర్లు వెంకటేశ్వర్లురెడ్డి, పిచ్చిరెడ్డి, నాయకులు వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధుల మంజూరు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు టైడ్, అన్‌టైడ్ నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ అప్పాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీలకు రూ.62,47,961 టైడ్ నిధులు, అన్‌టైడ్ నిధుల కింద రూ.41,65,320 వంతున మంజూరయ్యాయన్నారు. ఆయా నిధులతో పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉందన్నారు.

సాగరం నేతలకు జిల్లా కమిటీలో పదవులు



అక్కలరెడ్డి అంకిరెడ్డి



పెయ్యల సంపూర్ణమ్మ



పాళెం మధు

సోమశిల: అనంతసాగరం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలకు జిల్లా కమిటీలో పదవులు దక్కాయి. అక్కలరెడ్డి అంకిరెడ్డిని జిల్లా రైతు విభాగం కమిటీ జనరల్ సెక్రటరీగా, పాళెం మధును జిల్లా వలంటీర్ విభాగ కమిటీ జనరల్ సెక్రటరీగా, కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మను జిల్లా మహిళా విభాగం కమిటీ సెక్రటరీగా, గౌరవరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ కాలువ నరసింహులును జిల్లా ఎస్సీ సెల్ విభాగం సెక్రటరీగా నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఇటీవల ప్రకటన విడుదలైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో జిల్లా కమిటీలో పదవులు అప్పగించినందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉదయగిరి విద్యావనరుల కేంద్రంలో..



సీతారామపురం జెడ్పీ హైస్కూల్లో..



సంగం: సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న జిల్లా అధికారులు



జలదంకి ఉన్నత పాఠశాల ఆవరణలో..



సోమశిల: జిల్లాస్థాయి అవార్డు అందుకుంటున్న శ్రీలత



ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో..



అనుమసముద్రంపేట విద్యాశాఖ కార్యాలయంలో..



వింజమూరుకు చెందిన ఖాదర్‌బాషా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకుంటూ..



కలిగిరిలో..



కొండాపురంలోని ఎంఈఓ కార్యాలయంలో..



ఆత్మకూరురూరల్: చెర్లోయడవల్లి పాఠశాలలో..

ఉదయగిరి: స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను సన్మార్గంలో నడిపించే బాధ్యత గురువులదేనన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

- వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల కేంద్రంలోని పాతూరు ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్ ఖాదర్‌బాషా ఉర్దూ విభాగంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఆనంద్ ఆయనకు అవార్డు ప్రదానం చేశారు.
- సంగం: నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన గురుపూజోత్సవ వేడుకల్లో సంగం ఉపాధ్యాయుడు టి.సుబ్రహ్మణ్యం అవార్డు అందుకున్నారు. కలెక్టర్ ఆనంద్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చేతులమీదుగా సత్కారం అందుకున్నారు.
- అల్లూరు: నార్తు మోపూరులోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- జలదంకి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓలు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు పద్మనాభరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- సీతారామపురం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయుడు మార్కాపురం వెంకటసుబ్బయ్యను సహచర ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 ప్రవీణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులన్నారు.
- జలదంకి: బ్రాహ్మణక్రాకలోని శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో కరెస్పాండెంట్ మార్తెల్ల బ్రహ్మారెడ్డి, జలదంకిలో శ్రీసాయి పాఠశాలలో కరెస్పాండెంట్ బి.అయ్యలరెడ్డి ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించారు.
- కలిగిరి: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎంఈఓ గోళ్ల సురేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 17 మంది మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.
- సోమశిల: నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన గురుపూజోత్సవంలో సోమశిల హిల్ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయిని నీరుకట్టు శ్రీలత జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా కలెక్టర్ ఆనంద్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. అలాగే మండలస్థాయిలో శ్రీనివాసులు, బాలయ్య, చంద్రశేఖరరెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, ఆదిశేషయ్య, శ్రీలక్ష్మి సుప్రజ, రవి, మాలకొండయ్య, శుభాని, రమేష్ బాబు, విజయమ్మ, కృష్ణవేణి, అల్తాఫ్ హుస్సేన్, మాధవరావు, ఖాజావలి ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ఎంపీడీఓ కార్యాలయంలో అవార్డులు అందుకున్నారు.
- కొండాపురం: కొండాపురంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు కె.రవికుమార్, ఎం.ఆనందరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- ఆత్మకూరురూరల్: మండలంలోని చెర్లోయడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్‌ఎం పీవీ రమణయ్య పాల్గొన్నారు.
- అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ జ్యోతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈఓ–2 సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూరురూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మణి, నరసింహారావు, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, మహమ్మద్, సుధాకర్, జావెద్ మెహదీ, కొండారెడ్డి, అనిల్‌కుమార్, గంగాధరం, రామకృష్ణారెడ్డి, సుభాషణమ్మ, రేవతి, ప్రమీల, నాగేశ్వరరావు తదితరులు అవార్డులు అందుకున్నారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ చలపతి, ఉపాధ్యాయ సంఘాలకు చెందిన రామిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.